


•••అడివి.... లావాటి మనిషి అతణ్ణి కాళ్ళకింద పడేసి తొక్కుతున్నాడు. మరొకడు ఈడ్చుకుంటూ తీసుకువెళ్ళి ఎక్కడో పారేసి.... ఎక్కడో ఎవరో మూలుగుతున్నారు.... ఎవరో వో పిల్ల శవాన్ని మోసుకు వెళ్తున్నారు...

ఉలిక్కిపడి లేచాడు వాడు.

చుట్టూ చీకటి. కళ్ళు నులుముకొని చూశాడు. ఏమీ కనిపించలేదు. రొప్పుతూ భయం భయంగా లేచి అటూ యిటూ తిరిగేడు. అసహ్యమయిన వాసన వేస్తోంది.

ఇంకో కుర్రాడు గాఢనిద్రలో వున్నాడు. మళ్ళా కళ్ళు నులుముకున్నాడు. వాడికిదంతా జరిగినట్టే అనిపిస్తోంది. "అమ్మ .... అమ్మ....మంచాన పళ్ళేదు. చెల్లి చని పోలేదు" అని పైకే అని, దాన్ని నిర్ధారించు

**1983 ఉగాది కథానికల పోటీలో రు. 116/-లు కన్సొలేషన్ బహుమతి పొందిన కథ!**

కాని మళ్ళ పడుకున్నాడు కానీ—

ఎంతకీ నిద్ర రావట్లేదు వాడికి. వచ్చి నట్టే వచ్చి తెగిపోతోంది నిద్ర. మాటి మాటికీ ఏవో నీడలు ఎదుటకొచ్చి నిలబడు తున్నాయి. చెల్లి గాయం మానిందో లేదో? అమ్మ ఎంత దిగాలు పడిపోతోందో? అయ్యకు చీమకుట్టినట్టయినా లేదనుకుంటా? ఎంత తప్పు చేశాడు తను?

ఎంతకీ నిద్ర రావట్లేదు. కళ్ళుమూసినా. కళ్లు తెరిచినావాళ్ళేమెదులుతున్నారు.ఈకొట్టు ఈ యజమానీ. మొద్దు కుర్రాడు అంతా వో నరకంలా వుంది. ఏదో క్రూరమృగం వళ్ళల్లో పశి కొట్టుకుంటున్నట్టుంది. కాళ్ళూ చేతులు వేటికవి తెగిపోతున్నంత బాధగా వుంది. కొడ్తూ కొడ్తూ యజమాని చూసే చూపు.... గుండెల్లోకి దిగుతున్న ఛురిక లాంటి చూపు.... మెలికలు తిరిగిపోతున్న తనని చూసి ఆనందంతో వుండబట్టలేని కుర్రాడు.... ఇచ్చే నాలుగున్నర కోసం ఇంత కాల్చుకుతినడం ఎందుకో అర్థం కాలేదు వాడికి. దెబ్బలు తినీతిని వొళ్ళు హూనమయిపోతూంది. ఒంటరిగా వో మూల కూర్చొని ఏడ్వడం తప్పించి ఏం మిగిలింది కాదు. నిద్రలోనూ వెక్కివెక్కి యేడుస్తున్నాడు. గట్టిగా ఏడ్చిఏడ్చి పడిపోవా లనిపిస్తుంది. చచ్చిపోవాలనిపిస్తుంది. రాత్రుళ్ళనీన్ని కన్నీళ్ళలో తడిసిపోతున్నాయి. నిద్ర లేని కళ్ళల్లో ఎరుపు జీరలు కమ్ముకుంటు న్నాయి.

"చిన్నపిల్లాడు .... పడిసస్తడా?" అంటోంది తల్లి.

గోనెపట్టాలో ఎప్పుడు వచ్చి చేరాయో చీమలు. కుట్టడం మొదలెట్టాయి. ఇంకా నిద్రపోతూనే వున్నాడా కుర్రాడు. చుట్టూ భరించలేని వాసన. విసుక్కుంటూ రోడ్డు మీదికి వచ్చి నిలబడ్డాడు.

అప్పుడప్పుడే తెల్లవారుతోంది.

కొట్టుముందు కూర్చొని వచ్చేపోయే జనాన్ని చూస్తూ కూర్చున్నాడు రంగడు "ఇక్కడ కూర్చున్నావేంరా" అంటూ లోనికివచ్చేడు యజమాని. బుర్రమీసాలూ. ముందుకు పొడుచుకు వచ్చే బొజ్జా.... చూడంగానే భయమేసేట్టు వుంటాడతను. యజమాని వెనకెనకే చిన్నగా అడుగు లేస్తూ కొట్టులోకి వచ్చేడు. పాత కాగితాలు, ఇనపసామాన్లు ఖరీదు చేస్తారక్కడ.

ఇంకా ముసుగుతన్ని నిద్రపోతున్న మొద్దు కుర్రాణ్ణి లేపి మళ్ళా బయటి కెళ్ళి పోయాడు యజమాని. ఏమీ తోచక. అక్కడున్న పెద్ద త్రాసులో అటూ యిటూ రాళ్లు పెట్టి తూయడం మొదలెట్టాడు రంగడు. పరిగెత్తుకుంటూ వచ్చి వాడి వీపు మీద వొకటిచ్చుకున్నాడా కుర్రాడు. ఎందు క్కొట్టావని అడిగినందుకు మరొకటి యిచ్చుకున్నాడతను. ఏడుస్తూ కూర్చు న్నాడు రంగడు. కాసేపు వాడివంకే క్రూరంగా చూపులు విసిరి బయటికెళ్ళి పోయాడా కుర్రాడు.


"పొద్దున లేస్తే ఏడుపు ముగం" అంటూ రాగానే ధబీధబీమని బాదేడు యజమాని. వాడి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఓ చిన్న టేబులు ముందు వున్న కుర్చీలో కూలబడి లెక్కల పుస్తకంలోకి తలదూర్చాడు యజ మాని.

భయం భయంగా నెమ్మదిగా నడుచు కుంటూ వెళ్ళి వో మూలన వున్న చీపురు తెచ్చి వూడ్వడం మొదలెట్టాడు రంగడు. పరధ్యానంగా— ఊడుస్తున్న నేలంతా మసక బారిపోయింది. కళ్ళల్లో నీటి తెరలు పడుతు న్నాయి. మెదళ్ళో ఏదో తప్పుతున్నట్టనిపి స్తోంది.

* * *

లేచి. కళ్ళు నులుముకొని చూసేసరికి బాగా పొద్దెక్కినట్టే అనిపించింది వాడికి- అప్పటికే తల్లి వొకటి రెండు మాట్లు కేకలేసి వూరుకుంది. ఈ మారు లేవకుంటే పని చేతికే అప్పగించాలని. అంత సులభంగా మరిచిపోవలసిందేమీ కాదు. ఎంత నిద్ర లోనూ వాడి ప్రాణాలు తీసి అరచేతుల్లో పెడుతుందా దెబ్బ. "బారెడు పొద్దెక్కినా లేవవు.మడిసివి కాదూ. వోపాలి సెబితే సెవి కెక్కదూ" చెల్లి జుత్తులోంచి పేలు తీసి నొక్కుతూ అంటోంది తల్లి. చేతిలోవున్న గుడ్డపీలికను అటూ యిటూ తిప్పుతూ రక రకాలుగా దానివంక చూస్తూ. ఏదో గొణు క్కుంటోంది చెల్లి.


వొట్టి పిచ్చిది! ఎక్కడెక్కడో పెంటల్లో, చెత్తా చెదారాల్లో తిరిగి యిలాంటి వన్నీ పోగుచేస్తుంది. వాటిని వో చోట దాచి, చూసిచూసి మురిసిపోతుంది. రాత్రు ళ్ళల్లో చెట్లూ చేమల్తో మాటలు కలిపేసి



# అడివి

— అఫ్సర్

## పరిచయం



పుట్టి పద్దెనిమిదేళ్ళయ్యింది.

అమ్మం పీద్దారెడ్డి కళాశాలలో రెండో సంవత్సరం బి ఏ. చదూతున్నాను.

తండ్రి షంషుద్దీన్. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తల్లంపాడులో టీచర్.

ఇప్పటిదాకా పదీ పదిహేను కవితలు, మూణ్నాలుగు ప్రోజ్ పోయెమ్స్ రాశాను (పత్రికల్లో కాదు). రెండో మూడో మినీ కథలు రాసినా, ఇదే మొదటి కథ. దీనికే ప్రయిజ్ రావడం ఆశ్చర్యాన్నీ, సంతోషాన్నీ కలిగించింది.

అసలు పేరు మహబూబ్ అలీ; అందరూ పిలిచేది అవ్వర్. కొంతే రాసినా ఎంతో రాసేట్టుండాలని అనుకుంటాను.

—అవ్వర్

నిమిషాలు నిమిషాలు దొర్లించేస్తుంది. పొద్దుననంగ లేచి తన విశాల సామ్రాజ్యాన్ని తను స్వయంగా సందర్శించి వస్తుంది.

మళ్ళ నిద్రపోవాలనిపిస్తోంది. కూర్చొని మత్తుగా ఊగుతూనే వున్నాడు. వేసింది వేసిన చోట వుండకపోవడం అలవాటయిన గోనెపట్టాని దగ్గరికి లాక్కొని నిద్రలోకి జారుకోబోయాడు మెల్లిగా— చెట్టునానుకొని నిలబడ్డ మొల్లాళ్ళ కర్ర వాడి కళ్ళల్లో వడి నిద్రని చెదరగొట్టింది. నిన్నా యిలాగే అయ్యింది. ఆలస్యంగా లేచేసరికి అయ్య చేత దెబ్బలు తినాల్సివచ్చింది. కిమ్మన కుండా లేచి ముఖం కడుక్కున్నాడు. చొక్కాతో ముఖం తుడుచుకుంటూ నెమ్మదిగా కుడివైపుకి చూపును సారించేడు. తండ్రి యింకా గురకలు తీస్తూనే వున్నాడు. చూడబోతే యిప్పట్లో లేచేట్టు లేదు.

మూడురోజులయింది ఈ వూరొచ్చి. బండీ దిగీదిగగానే వుండటానికి ఈ చోటు దొరికింది. ఊరు అంత దూరాన్నేమీ లేదు. కాయలుకాయాల్సినకాలమే అయినా కనీసం ఆకులయినా లేక మొండిగా నిలబడి వుందా చెట్టు. ఎండ మరీ విపరీతంగా వుండడంతో ఎక్కణ్ణుంచో పాతబడ్డ గోనెపట్టాలు కాయితాలు అవీ యివీ తెచ్చి, కప్పు నిలబెట్టింది తల్లి. అయినా ఎండకు తట్టుకోవడం కష్టంగానే వుంది కానీ తప్పని పరిస్థితి. తండ్రీ కొడుకూ కలిసి రెక్కలు ముక్కలు చేసుకున్నా అమ్మిన మొల్లాళ్ళు సరిపోయేంత తిండి పెట్టవు. తల్లీ పనీపాటా లేనిదయ్యింది. అయినా అక్కడో రోజు యిక్కడో రోజు వుండేవాళ్ళకు పని ఎవరిస్తారని? చెల్లివుందీ. అయిదారేళ్ళయినా దాటలేదు దానికింకా.

చెట్టు పక్కన పొయ్యి మీద వున్న గిన్నెని చూస్తూ నిలబడ్డాడు రంగడు. కళ్ళు మండిపోతున్నాయి. లోనికిపోయి దొక్క డెకేర్‌మంటూంది. ఇవ్వాళయినా చద్ది మిగిలిందో లేదో! వచ్చినప్పట్నుంచీ ఏం తిన కుండానే వీధిన పడాల్సి వస్తోంది. బేరం సాగట్లేదు సరిగ్గా. వచ్చిన డబ్బులు యేమాత్రం సరిపోయేవిగా లేవు. వారం వారంన్నరరోజులదాకావున్నా ఏవూళ్ళోనూ యింతగా తిండికి చూడాల్సిన పరిస్థితి కలగలేదు.

గిన్నెమీంచి చూపులు తల్లిమీదికి మరలాయి. ఆమె అలా పేలు నొక్కుతూనే వుంది. చెల్లి గొణుగుతూనే వుంది. తల్లి నుంచి జవాబు వస్తుందని వాడి ఆశ. ఎంతకీ ఆమెదగ్గర్నుంచి మాటా పలుకూ లేదు. వాడే అడిగేడు. లేదని మెల్లిగా తలూపింది తల్లి. అంత ధీమాతో చెప్పడం వాడికి కోపాన్ని తెప్పించింది. కడుపులో కత్తులు తిరిగి నట్టనిపించింది. భగభగ మండిపోతూ వెళ్ళి పొయ్యిమీది గిన్నెని చేత్తో విసిరి కొట్టేడు. అది అంత దూరాన్న వెళ్ళి అక్కడున్న రాళ్ళల్లో పడిపోయింది.

పిల్లని పక్కకి నెట్టి గబగబ లేచి ఆ గిన్నెని తీసుకొచ్చి. "కడుపు నిండిందా. సల్లగా వుండింక." అంటూ మళ్ళ పొయ్యమీద పెట్టిందా గిన్నెని— "పైసల్లేవ్. ఏదో సర్దుకు పోదామనే యిదే వుండదు. కిందా మీదా పడి ఆ యింట్లో ఈ యింట్లో అడుక్కొచ్చి పెట్టిన రోజులేవా? వుంచే పెట్ట దానికేమన్నా.." అంది గొంతు పెద్దది చేసి.

"లేదు. నేను చచ్చినా పోను" అంటూ మొండికేసి కూచున్నాడు.

"అయ్య లేస్తాడ్రా....!" గట్టిగానే గద్దించింది.

"లేస్తే లేవనీ...." అంటూ మూతి ముడుచుకూర్చున్నాడు.

"మీరూ మీరూ యాడయినా సావండి" అంటూ మళ్ళ వెళ్ళి చిన్నదాని జుత్తులో వేళ్లు దూర్చుతూ కూచుంది తల్లి. వాడికిది నసాళానికంటింది. కనిపించిందల్లా విసిరేయడం మొదలెట్టాడు. "దొంగముండది. లేవకముందే గిన్నెలన్నీ నాకి వుంచుద్ది" అంటూ చెల్లిమీద వో రాయి విసిరేడు. ఇంతెత్తున గొంతెత్తిందది. చూస్తే దెబ్బ తగిలింది. నెత్తురూ కారుతూంది.

"సచ్చినోడా .... ఏం పోయేగాలమొచ్చిందిరా" అని కేకలేస్తూ రక్తం కారుతున్న చోట పైటతో అదిమిపట్టింది తల్లి. "ఆ తగలడం తగలడం కంట్లో తగిల్తే ఏం చేసేవోడివిరా? అసలే పూటకులేనిబతుకులు. ఏడ తెచ్చి పోసేవాడివిరా" అంటూ ఏడుపు కంఠం ఎత్తింది. ఇంక చిన్నదాని ఏడుపుకి పట్టపగ్గాల్లేకుండా పోయాయి.


ఈ గోలకి విసుక్కుంటూ లేచాడు అయ్య. "రాక్షసులు.... పడుకోనీరు. ఏమయ్యిందే?" కొంపలంటుకున్నట్టు అరిచేడు.

"ఏమయిందేంటి. సూడు నీ కొడుకు గనకారం" అంటూ చెల్లి నుదుటిని చూపించింది తల్లి. అదనుచూసి ఏడుపు మరింత పెంచింది చెల్లి.

రంగడికి వణుకు మొదలయింది. వాడి పైప్రాణాలు పైనే లేచిపోయాయి. అయ్య లేస్తే చావబాదుతాడు. అటూ యిటూ చూసి పిక్కబలంచూయించేడు తల్లి కేకల మధ్యా, చెల్లి ఏడుపు మధ్యా చాలా దూరమే పరిగెత్తాడు వాడు.

ఆ పరుగుపరుగు వూళ్ళోకొచ్చాడు. రొప్పుకుంటూ రోజుకుంటూ దొరికినదారల్లా పరిగెత్తాడు. చివరికి రైల్వే స్టేషన్‌లోకొచ్చి లోపలిబెంచీమీదకూర్చున్నాడు. బండి రాబోతుందేమో. రద్దీగా వుంది ప్లాట్‌ఫామ్. అసహనంగా అటూ యిటూ తిరుగుతున్నారు ప్రయాణీకులు. అంతా అయోమయంగా వుంది వాడికి. మెదడు దట్టమయిన అడవిలాగా వుంది. ఎందుకు కొట్టానా అనిపించింది వాడికి. ఎందుకేమిటి. కాళ్ళూ కీళ్ళూ విరిగిపోయేలాగా రోజంతా తిరగాలా. కసింత మిగల్చాలనే బుద్ధి లేదూ అనికూడా అనుకున్నాడు. ఆ జవాబు వాణ్ణి వోదార్చలేకపోయింది.

ఎంతసేపో కూచోలేకపోయాడు. తండ్రి కంటబడే సమస్యే లేదనుకున్న వీధుల్లో చేతులూపుకుంటూ, చిరచిరలాడుతూ బరువుగా అడుగులేస్తున్నాడు. నడిచేకొద్దీ విసుగనిపిస్తోంది రోడ్డు. రిక్షాలు. కార్లు జనంతో కిక్కిరిసిన వీధులు. తల బద్దలుకొట్టే రొద. ఈ బజార్లన్నీ బాగా ఎరుక వాడికి. లెక్క ప్రకారం యివన్నీ వాడి వీధులు. అయ్య




ఈ ఛాయలకైనా రాడు. ఆ మొల్తాళ్ళ కర్ర పట్టుకొని ఇల్లిల్లూ పట్టుకు తిరగాలి. ఎంత చికాకయిన పనో!

ముఖం కడుక్కోనీ, వుంటే చద్దన్నం తిని వెళ్ళింది వెళ్ళగం మళ్ళా మధ్యాన్నానికి ఇంటికి చేరాలి. ఏదీ నిశ్చితం కాదు. అంతా పైనోడి దయ-పోలే బాగానే అమ్ముడు పోతాయి. బాగానే అంటే మూడూ నాలుగూ అట్టా-లేకుంటే చావే! ఎంతకీఅమ్ముడవవు. బోణీ చేసినోడిచెయ్యి మంచిదయితే అంతా సజావుగానే సాగుతుందని అంటుంది తల్లి. ఆ లెక్కన చూస్తే ఇప్పటిదాకా మంచోళ్ళంటూ లేరనుకోవాలి. ఖాళీచేతుల్తో ఇల్లు చేరిన రోజులున్నయి. ఆ రోజు నరకం కన్నా హీనమయింది. రాత్రి నిద్రయినా పట్టదు. అమ్మ ఏమీ అనకపోయినా తాగిన మత్తులో నోర్మూసుకు కూచోలేడు అయ్య. "అరె....ఈ మాతరం అమ్మకుంటె ఏం బతుకతడీడు? చ....చ...." అంటూ నిద్ర వచ్చేదాకా తిడ్తానే వుంటాడు.

"పో నీవయ్యా ఏదో చిన్నోడు. చేయేదో కాలేదో తెలీనోడు. ఆ మాత్రం చాలు. పోకపోతే వాడేం చేస్తడు— పడి చస్తడా?" అని సర్దబోతుంది తల్లి. "ఇస్మంటోళ్ళ యవ్వారాలు నాకు బాగా ఎరుక. నాకేం సెప్పక. ఎక్కడ కూలబడి కునుకులు తీస్తుండో. రమ్మంటే వస్తదా బేరం- ఇల్లిల్లూ పోవాలా, కాలూ సేయట్టుకోవాల. అదీ యిదీ సెప్పి అమ్మాలా. గదీ లేదు. యిదీ లేదు. ముక్కూ-మూతీ మూసుకూకుంటే కొనేదెవడు? నోటిమీద మాట రానోడు. లంజాకొడుకు.... దారి సూపిస్తే బతకలేనోడు.... యీడి వాలకం సూస్తంటే వుండేరకంలా లేడు...." ఏదేదో అనేస్తూనే వుంటాడు. కాసేపు ఏదో చెప్పి వూరుకుంటుంది తల్లి.

ఆ మాటలు వాడి గుండెల్లో జ్వరాన్ని పుట్టిస్తయి. ఒక పట్టాన వదలదు వణుకు. నరాల్ని పట్టుకు లాగేసినట్టు ఒకటే భయం లోపల్లోపలికి పాక్కుంటూ పోతుంది. తల్లి కూడా తనవైపు గట్టిగా మాట్లాడదు. లోప ల్లోపలే ఏడుపు దిగమింగుకొని ఎప్పటికో పడుకుంటాడు.

నిజానికి ఆ రోజు వాడు పడ్డ బాధ అంతా యింతా కాదు. రోజుకిమల్లే ఆ రోజూ బయల్దేరాడు. రోజూ తిరగాల్సిన వీధులన్నీ తిరిగేడు. తనకు తెలీని వీధులు,తన లెక్కలో లేని వీధులు అన్నీ పట్టుకు తిరిగేడు. కాళ్ళు పీకుతున్నా కళ్ళు మండుతున్నా యింటికెంతో కొంత తీసుకెళ్ళాలనే పట్టుదల మాత్రం వదలదు. ఏమీ లాభం లేకిపోయింది. నిరాశతో డీలా పడిపోయి యింటికి వచ్చాడు. అసలేమీ పోలేదనే బాధతో పస్తూంటే మరోవైపు తనుపడ్డ శ్రమనంతా కాసిని మాటల్లో తేలికచేసిన అయ్య మాటలు పక్కల్లో దిగీదిగని కత్తుల్లాగా బాధ పెడుతున్నయి. బాధా భయం రెండూ వాడి గుండెల్లో పేరుకుపోతున్నయి. అమ్మ కూడా గమ్మున వుండిపోతుంది. వాడికిదేమీ అర్థం కాకుండా వుంది.

ఆ రాత్రి ఎప్పుడు నిద్ర పట్టిందో! తెల్లారి లేచేసరికి చిన్నది గిన్నె ఖాళీ చేసి కూచుంది. మాడుతున్న కడుపుతోనే ఆ రోజు పనిలో కెళ్ళాడు. వచ్చిన మొదటి అర్ధరూపాయితో ఏమయినా కొనుక్కు తినమంది తల్లి. మధ్యాన్నం భోజనం వేళ అవుతున్నా అర్ధరూపాయి దొరకనూలేదు. వాడి కడుపు నిండనూ లేదు. పనిమీదనే అసహ్యమేసింది వాడికి. పాడుపని! ఇచ్చిన చేసినా రోజెళ్ళట్లేదు. వాడికీపనికాక యింకో పని చూసుకుంటే యిన్ని యిడుముల పాల వ్వాల్సి వచ్చేది కాదేమో ననిపించింది. ఈ బతుక్కంటే మునుపటి బతుకే బాగని పించింది. అయితే అప్పటిదాకా ఆవూళ్ళోనే పడివుంటే ఆకలిదప్పుల్తో శవాలెల్లేయి.

ఒకవిధంగా రంగడి బతుక్కి గానీ రంగడి అయ్య బతుక్కిగానీ వాళ్ళది కాదు పూచీ. వాళ్ళ వూళ్ళో వున్నప్పుడు కూలీపని చేసేవాడు అయ్య. పర్లేదు. పస్తుండాల్సిన దౌర్భాగ్యముండేది కాదు. రోజులేం మాయ చేశాయో ఆ పనులు కూడా లేకుండా పోయినయి ఉన్న కొంప కాస్తా కుదువబెట్టి అప్పో సప్పో చేసి, కలోగంజో పెట్టి ఎలాగోలా కొన్ని రోజులు నెట్టుకొచ్చాడు తండ్రి. ఇక పనులు తగిలే జాడ కనిపించలేదు. చేలు వున్నవాళ్ళకే చేతినిండా పని లేదు. చిన్న చిన్న రైతులు ఇల్లూ వాకిలీ వదిలేసి, వున్న వన్నీ అమ్ముకొని కడుపు పట్టుకొని పట్నానికి వెళ్ళిపోతున్నారు. ఊరోళ్ళు ఆ మాటా ఈమాటా అన్నాకా చివరికీ పనిలో చేరాడు అయ్య.

రెక్కల కష్టంమీద బతుకు నెట్టుకొచ్చేవాళ్ళకి ఈ పనే ఎందుకు తగిలిందనడానికి కారణముంది. అయ్య వెనకటోళ్ళు ఈ పనితో బతుకులు వెళ్ళమార్చినవారే. అమ్మ అప్పుడప్పుడూ చెబుతూనే వుంటుంది. ఆవిడ తాతగారు మొల్తాడు కట్టకుంటే ఏ పిల్లాడూ బతికి బట్టకట్టేవాడు కాదంట. బతుకులోమరి. "గొప్పింటి వయిబోగాలతో" గడిపేవారంట. అయ్యకూడా చిన్నప్పుడు ఈ పని చేసినోడే! అసలతనికి యిష్టమే లేదు ఈ పవిలో మళ్ళా కూరుకుపోడం. అయినా చేయక తప్పింది కాదు. దానికి తల్లి వత్తాసే ముఖ్యమయింది కూడా.

వాడిఅనుభవం వాడి తండ్రి అనుభవం చూశాక అమ్మ చెప్పినవన్నీ నీటిమూటలే అనిపించింది వాడికి. "వట్టి అబద్దాలకోరని" తండ్రి అంటూ వుంటాడు యిందుకే గాబోలు అనికూడా అనుకున్నాడు వాడు. సరే! ఈ పని బతుక్కి చాలట్లేదని మరో పనీ వెతుక్కోడు తండ్రి. చొక్కామీది చిరుగులా పనినిగూర్చి పట్టించుకోనయినా పట్టించుకోడు. వెళ్తాడు. అమ్ముడుబోతే అమ్ముతాడు. వచ్చినవాట్లో సగం సారాకే పోస్తాడు. ఇల్లూ పెళ్ళాం పిల్లలు యివేం పట్టనట్టే వుంటాడు. ఇంకోపని వెతుక్కోమని చెప్పనూ చెప్పదు తల్లి. ఆ మొల్తాళ్ళ కర్ర పట్టుకుంటేనే కడుపు నిండినట్టుంటుందామెకు.

కాకి బతుకయింది. పాడు బతుకు. వో వూరంటూ వో చోటంటూ స్థిరం లేదు. బేరం సాగకపోతే మకాం ఎత్తేయడం. మరో చోటికి వెళ్ళడం! ఇలా ఎన్ని వూళ్ళు ఆచింకి చాపటూ. మొల్తాళ్ళ కర్రలూ, పాలిపోయిన దేబెరి ముఖాలు. ఖాళీ కడుపులు పట్టుకు తిరి

గారో లెక్కే లేదు. బేరాలు చేసే మనుషులన్నా వాడికి అసహ్యం. అర్ధరూపాయంటే పావలా! పావలా అంటే పది- ప్రాణాలు తీసేస్తారు. ఎలా పడుతుందీ ఏమిటనే బుద్ధి బొత్తిగా వుండదు- మగాళ్ళు అంతే. గీకి గీకి బేరమాడతారు. నసుగుతూ గొణుగుతూ ఏదో దయ తలుస్తున్నట్టు యిస్తారు ఆ యిచ్చేదేదో!

ఆలోచించే కొద్దీ అసహ్యమనిపిస్తోంది. కుక్కకన్నా హీన మనిపిస్తోంది. ఇంత చిరచిరతో ఇంత చికాకులో బతకడంకన్నా చావు నయమనిపిస్తోంది. "పాడు మనుషులు పాడు కొంప. పోకపోతె మానె" అనుకున్నాడు. ఆ మాత్రం ఎల్లదా అనీ అనుకున్నాడు. ఈ పని తప్పితే మరేవనయినా సుఖమేననీ డబ్బులొచ్చేదేననీ వాడి నమ్మకం.

మళ్ళీ కడుపులో దేవులాట మొదలయింది.

సూర్యుడు మండిపోతున్నాడు. పెనం మీద పెట్టి కాలుస్తున్నట్టుంది. నడుచుకుంటూ నడుచుకుంటూ వచ్చేసరికి రైల్వేస్టేషన్ దగ్గరయింది. అవతలి ప్లాట్‌ఫాం మీదకు వెళ్ళి చెట్టుకింద వో బెంచీమీద కూలబడ్డాడు. ఆ చెట్టుకింద కొన్ని బిచ్చగాళ్ళ కుటుంబాలు కాపురముంటున్నాయి. ఆ ఆడాళ్ళూ, మగాళ్ళూ, పిల్లలు ఎవరికివాళ్ళు ఏమిటేమిటో కంగాళీగా మాట్లాడుకుంటున్నారు. ఆవురావురుమని తిండి తింటూ- వాళ్ళ మాటలేవీ వాడి కందట్లేదు. వాళ్ళు తింటున్న తీరు చూస్తే ఆకలయినా చచ్చిపోతోంది. ఆట్టే వారివంక చూడలేక చూపులను కొమ్మమీద గంతులేస్తున్న కోతిమీదకు మరల్చాడు.

కిందికి చూసేసరికి. ప్లాట్‌ఫాం కింద యిద్దరు కుర్రాళ్ళు కన్పించారు. కాగితాలు. ప్లాస్టిక్కులూ. చెత్తాచెదారం ఏరి కుప్పలు పెడుతున్నారా యిద్దరు. ఏవేవో మాటల మధ్యా పాటల మధ్యా గంతుల మధ్యా పోగుచేసిన వాటిని వేటికవి వేరు చేస్తున్నాడు కుర్రాళ్ళు. తింటూ తింటూనే వేళ్ళని నాక్కుంటూ ఏదో అన్నాడో ముసలాడు, వీళ్ళ వంక చూసి — నెత్తి మీద మాసిపోయిన టోపీని కాస్త పైకి లేపి. పళ్ళన్నీ బయటపెట్టి వో కుర్రాడు దానికేదో వెకిలి జవాబు చెప్పాడు. నవ్వుతూ లేచి వెళ్ళిపోయాడా ముసలాడు.

"అటు సూడు.... ఆ బొమ్మ..ఇయ్యాల దాన్ని సూడాల" అన్నాడు మరో కుర్రాడు సినిమా వాల్ పోస్టర్ను చూపిస్తూ. దానివంక చూసి అసహ్యంగా నవ్వాడు మరో కుర్రాడు. రంగడు కూడా అటు చూశాడు కానీ అటు చూడలేక ముఖం తిప్పుకున్నాడు.

మాటల్లోనే చకచకా పని చేస్తున్నారు వాళ్లు. ఏంచేస్తారో అనే ఆశ్చర్యంతో కళ్ళప్పగించి చూస్తున్నాడు రంగడు. "ఇవన్నీ ఎందుకు?" ఎంతో ప్రయత్నం మీద మెల్లగా అడిగేడు. ఏదో గొణిగి. వెకిలిగా నవ్వుకున్నారు వాళ్ళిద్దరూ. వాళ్ళేం చెప్పిందీ వాడి తలకెక్కలేదు. మళ్ళీ అడగాలనుకున్నాడుగాని అడగలేకపోయాడు. కాగితాలన్నీ ఓ బస్తాలో కుక్కి దాని మూతి కట్టేశారు వాళ్లు. అలాగే వో ప్లాస్టిక్ సంచిలో సీసాలూ. మిగిలిన చెత్త కూడ "అమ్మయ్యా" అని వో దీర్ఘమయిన శ్వాసతీసి. జేబులోంచి బీడీ వొకటి తీసి. పచ్చగా నల్లగా వున్న పెదవుల్లో పెట్టుకుని. నెత్తి మీద బస్తా. యింకో చేతిలో ప్లాస్టిక్ సంచీ పట్టుకొని బయల్దేరారు. "ఇవ్వాళొస్తయిలె నిన్నకంటె ఎక్కువే" అనుకున్నారు. వాళ్ళ వంకే చూస్తూ నిలబడ్డాడు రంగడు. ఈ పనేదో వీలయ్యేదిగానే వుంది- పైగా డబ్బులు తెచ్చిపెట్టేదిగానూ కనిపిస్తోంది. అనుకున్నాడు.

ముందుకు వెళ్తున్న వాళ్ళ దగ్గరికి పరిగెత్తి "నాకూ ఈ పని కావాలి." అన్నాడు గొణిగినట్టు- వణుకుతున్న పెదవులతో. "పనీలేదు గినీలేదు ఫో... ఫో" తానే యజమానయినట్టు హుంకరించేడో కుర్రాడు. "రానీరా పాపం" అని దయతల్చేడు మరొకడు. తానే దేవుడయినట్టు. చిన్నగా నవ్వుతూ—

ఎన్నో మలుపులు తిప్పి వో చోటికి తీసుకొచ్చారు వాణ్ణి — ఇంతెత్తున నిలబెట్టి వున్నాయి. పెద్ద పెద్ద బస్తాలు. వో పెద్ద తరాజు. తడికలే అడ్డు వీటన్నిటికీ - కంది కట్టల్తో కట్టిన వో గుడిసె. చెల్లా చెదురుగా పడివున్నాయి కాగితాలు. సీసాలు. పనికిరాని ఇనుప సామాన్లు కొందరు కుర్రాళ్ళు వాటిముందు కూర్చొని వాటిని వేటికవి వేరు చేస్తున్నారు.

"అయ్యగారో! గేడింగ్‌కి వొకణ్ణి చూడమన్నారుగా. వీణ్ణి పట్టుకొచ్చేం" అంటూ అక్కడ నిలబడి వున్న వ్యక్తికి రంగణ్ణి చూపిస్తూ అన్నాడా కుర్రాడు. చెమట వాసనతో. అసహ్యంగా వున్నాడా మనిషి. మాటి మాటికీ మీసాలమీద వేళ్ళు పోనిస్తూ "ఏం— చేస్తవా? రెండో రోజే వుడాయిస్తవా...?" పెద్దగా అరిచినట్టు అడిగేడు. చేస్తానన్నట్టు మెల్లిగా తలూపేడు రంగడు.

కుర్రాళ్ళు తెచ్చిన వాటన్నిటినీ తూచి లెక్కలు చూస్తూ నిలబడ్డాడతను. కాసేపయ్యాక అయోమయంగా అటూ యిటూ చూస్తూ నిలబడ్డ రంగణ్ణి దగ్గరికి పిలిచేడు. "ఒరే. మొద్దూ" అని కేకేసేసరికి అక్కడున్న కుర్రాళ్ళలో వొక కుర్రాడు ముందుకొచ్చి నిలబడ్డాడు. వొంటిమీద చొక్కా లేక. నల్లగా మొద్దులాగా వున్నాడతను. ఆ కుర్రాడు అతని వంక గర్వంగా చూసి. వెంట తీసుకువెళ్ళి ఏం చేయాలో ఎలాచేయాలో చెప్పడం చూపడం మొదలుపెట్టాడు. పని తేలిగ్గానే కనిపించింది. మధ్యమధ్య వినడంలేదని. దిక్కులు చూస్తున్నాడని అనుమానం వచ్చినప్పుడు చెయ్యెత్తి కొట్టడానికి కూడా వెనుకాడలేదా కుర్రాడు. యజమానికీ. ఈ కుర్రాడికీ ఆకారంలో తప్పించి. మిగతా విషయాలన్నిటి

---

'యువతరానికి' చర్చావేదిక


## "స్త్రీలకు ఉద్యోగాలలో ప్రత్యేక రిజర్వేషన్లు అవసరమా? (వుంటే ఎలా? ఎంతమేరకు ?)"

ఈ అంశంపై యువతీయువకుల నుంచి అచ్చులో ఒక పేజీకి మించని వ్యాసాలను ఆహ్వానిస్తున్నాము. తమ అభిప్రాయాలను హేతుబద్ధమైన కారణాలతో చక్కగా వివరించినవారికి వ్యాసానికి రూ. 30/- పారితోషికం వుంటుంది. వ్యాసాలు పంపేవారు తమ ఫొటోను కూడా విధిగా ప్రచురణకు పంపాలి.

మీ వ్యాసాలను—

"యువతరానికి చర్చావేదిక", ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, పోస్ట్ బాక్స్ నెంబరు 712, విజయవాడ—520 010కు 31—5—1983 లోగా పంపాలి. ప్రచురణకు యోగ్యంకాని వ్యాసాలను త్రిప్పి పంపటానికి తగు పోస్టేజి అంటించిన కవర్లను జతచేయాలి.

—ఎడిటర్




లోనూ పోలికలున్నాయని తెలుసుకోడానికి ఎంతోసేపు పట్టలేదు రంగడికి.

ఆ రెండ్రోజుల బతుకూ వాణ్ణి బాగా కలచివేసింది. పెనంమీంచి పొయ్యిలో పడ్డట్టయింది. రోజూ వస్తున్న నాలుగున్నర నాలుగు దారుల్లో ఖర్చయి పోతున్నాయి. ఏదో తినడం. అక్కడే పడుకోవడం. ఆ మొద్దు కుర్రాడు కూడా అక్కడే పడుకుంటాడు గానీ రంగడికి దూరంగా వీడి చేతనే వూడ్పించి. పక్కేయించుకొని దర్పంగా పడుకుంటాడు. ఎప్పట్నుంచో వుంటున్న వాడతను. యజమాని దగ్గర బుద్ధిమంతుడని పేరు తెచ్చుకున్న వాడతను. పని ఎక్కువయిందనే రంగణ్ణి పెట్టుకున్నాడా యజమాని. చేరినప్పట్నుంచీ ఆశ్చర్యపడుతున్న ఈ వ్యాపారం గూర్చి రంగడు అడిగితేనే కసురుకున్నాడా కుర్రాడు. కంపెనీకి తోల్తారని ఎవరో చెబితే "వాహూ" అనుకొని సర్దుకుపోయాడు.

పని బాగా చేయట్లేదని రెండో రోజే తన క్రూరత్వాన్ని చూపించుకున్నాడు యజమాని. ముందు అనుకున్నంత సుఖమయిన పని కాదని వాడి అనుభవంలో కొచ్చింది. "గోరుచుట్టు మీద రోకటి పోట"న్నట్టు ఆ కుర్రాడొకడు — రంగడు పనిలో చేరడం అతనికెంతో సుఖాన్నిచ్చింది. అంతేగాక తన విధేయతను ప్రదర్శించుకోవడానికి మరింత అవకాశమిచ్చింది. అదను దొరికినప్పుడల్లా యజమానికి వాడిమీద ఫిర్యాదులు చేసి. దెబ్బలు తినిపించాలని చూస్తుంటాడతను. ఎంతసేపటికీ అదే అతని వ్యాపకంగా మారిపోయింది.

ఇక్కడ నిలదొక్కుకోవడం కష్టంగా పరిణమించింది. ఎలాగయినా వీళ్ళ ఇనప చేతుల్లోంచి పారిపోవాలనే ఆలోచన వాణ్ణి వూపిరితీయనీయడంలేదు. ఈలోగా ఉద్వేగం అయిపోయింది. చీపురు తీసుకెళ్ళి వో మూలన పెట్టేసి. కాసేపు నిల్చొని. ఏదో నిర్ణయించుకున్న వాడిలా మళ్లీ వొక నిట్టూర్పు విడిచి ఆ ఆలోచనలను తెంపేశాడు.

* * *

కళ్ళు నలుచుకొని చుట్టూ చూసేసరికి. అప్పుడప్పుడే చీకటి విడిపోతోంది. రోడ్డు మీద జన సంచారం మొదలయింది. మొద్దు కుర్రాడు యింకా నిద్రపోతూనే వున్నాడు. వాడికి కళ్ళు పీకుతున్నాయి. రాత్రల్లా నిద్ర లేదు. అదీ యిదీ చేసేసి పన్నెండింటిగ్గానీ నిద్రపోయే వీలు దొరకలేదు.

రోడ్డు మీదకు వచ్చాడు రంగడు. చాలా నిరసంగా వుంది. ఒకో అడుగు ముందుకు వేస్తున్నకొద్దీ వాడిలో సంతోషం గూడు కట్టుకోసాగింది. నాలుగు రోజులుగా బతుకు మీద పేరుకున్న అసహ్యం మెల్ల మెల్లగా చెదిరిపోతున్నది. ఎప్పటికిమళ్లేనే బతకొచ్చనే ఆలోచనే వాడి నరాల్లో రక్తాన్ని ఆవేశిస్తోంది. ఎంచక్కా నిద్రపోవచ్చు. ఎప్పుడోకాని దెబ్బలు తగలవు. అమ్మ ఆనందంతో ఉక్కిరి బిక్కిరవుతుంది. ఈ పాటికి జరిగినవన్నీ మరిచిపోయే వుంటుంది చెల్లి. సంతోషంతో తలమునకలయి తన సంపాదనంతా తెచ్చి ముందు పడేస్తుంది. తండ్రికిదేమీ పట్టదు.

మెల్లిమెల్లిగా తెల్లారుతోంది. అడుగులు వేగంగా పడుతున్నాయి. నిన్నటి వరకూ గుండెల్ని చిదిమేసిన బాధ.... భయం.... అన్నీ విస్మృతిమవుతున్నాయి. చీకటి విడిపోయి సూర్యుడి నీడ విస్తరిస్తున్నది. లేత ఎండ అతని శరీరంలో అణువణువూ పేరుకున్న నైరాశ్యాన్నీ. చీకటినీ. బాధనీ. వొణుకునీ. నిస్సత్తువనీ చీల్చుకుపోతోంది.

ఆనందంతో. ఆశ్చర్యంతో. కుదుపులతో అక్కడికి చేరినవాడికి నెత్తి మీద పిడుగు పడ్డట్టు కాలూ చెయ్యీ ఆడలేదు. తన కళ్ళని తనే నమ్మలేకపోయాడు. మనుషులు వుంటంతో ,నునుపుదేలిన నేల..........నల్లబడ్డ పొయ్యిరాళ్ళల్లో గాలికి పోగా పోగా మిగిలిన బూడిద....నోట మాటలేక నిర్జీవంగా వెనక్కి అడుగు వేశాడు. పి చ్చెక్కిన ట్టు వచ్చిన దారినే పరుగుతీయడం మొదలెట్టాడు. అతని వంక మౌనంగా జాలిగా చూస్తూ నిల్చుండిపోయిందా మొండిమామిడి వొంటరిగా. ●

విధివశాత్తు అతను అసమర్థుడైన కారణాన....చిరిగిన వస్త్రాన్ని పారేసినంత తేలికగా భర్తనికూడా వదిలెయ్యడమేనా?

జయరాం ఆకర్షణనుంచి తప్పించుకోలేక .... ప్రభాకర్‌ని కాదనలేక....తనలో పురి విప్పుతున్న కోరికల ధాటికి తట్టుకోలేక నలిగిపోయిన నిరీక్ష....చివరికి ఏ నిర్ణయం తీసుకుంది?

త్వరలో ప్రారంభం

1982 విజయదశమి నవలల పోటీలో

మూడవ బహుమతి రు. 2000/- పొందిన

శ్రీమతి ఆదూరి సావిత్రి రచన

అనురాగ సంగమం